కరెంట్ కష్టాలకు చెక్

- వెల్టూరులో సబ్‌స్టేషన్ నిర్మాణంతో నాలుగు గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్
- రేపు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి చేతుల మీదుగా ప్రారంభం


వెల్టూరు గ్రామంలో నిర్మించిన సబ్‌స్టేషన్

చిన్నంబావి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెలుగులు నింపేందుకు ఏర్పాటు చేసిన శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయి చీకట్లోనే ఉన్న మండలంలోని వెల్టూరు, చిన్నమారు, అయ్యవారిపల్లి, కాలురు, చెల్లపాడు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న కరెంట్ కష్టాలు ఇక నుంచి తీరనున్నాయి. ఆకాశంలో మేఘం మెరిసినా.. ఉరుము ఉరిమినా క్షణాల్లో పోయే కరెంట్. మళ్లీ ఎప్పుడు వస్తదో తెలియక పడిన ఇబ్బందులకు ఇక చెక్ పడినట్టే. దాదాపు పుష్కరకాలంగా ఎదురు చూస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎట్టకేలకు ఆగస్టు 2న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభం కానుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రూ.2 కోట్లతో నిర్మాణం

వెల్టూరు గ్రామంలో 33/11కేవీ నూతన సబ్‌స్టేషన్‌ను రూ.2 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో వోల్టేజీ సమస్యకు కూడా చెక్ పెట్టనున్నారు. పెద్దదగడ సబ్‌స్టేషన్ నుంచి వెల్టూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో వెల్టూరు, చెల్లపాడు, అయ్యవారిపల్లి, చిన్నమారూరు, కాలురు గ్రామాల వ్యవసాయ బోరు బావులు, గృహ విద్యుత్ వినియోగదారులకు నిరంతర కరెంట్ సరఫరా జరగనుంది.

ఫలించిన కృషి..

దాదాపుగా దశాబ్ద కాలంగా వెల్టూరు గ్రామ ప్రజలు పలు రకాలుగా సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా లాభం లేకపోయింది. కానీ నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసినా.. పలు సాంకేతిక కారణాలకు తోడు రాజకీయ ఒత్తిళ్లతో పనులు ప్రారంభం కాలేదు. వెల్టూరు గ్రామానికి చెందిన కేఎంఆర్ ట్రస్ట్ సభ్యులు సబ్‌స్టేషన్ నిర్మాణం అవశ్యకతను ఉన్నతాధికారులకు, మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన వారు ఏడాది లోపే పనులు పూర్తి చేశారు.

మంత్రి కృషితోనే..



వెల్టూరు, కాలురు, చెల్లపాడు, అయ్యవారిపల్లి, చిన్నమారు గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి జూపల్లి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన వారు ఏడాది లోపే సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయించారు. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు కరెంట్ అంతరాయాలకు శాశ్వతంగా పరిష్కారం దొరికింది.

– కొత్త కళ్యాణ్‌రావు, కేఎంఆర్‌ట్రస్ట్ చైర్మన్

ఎన్నో ఏళ్లుగా..



ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న కరెంట్ సమస్యకు పరిష్కారం దొరికింది. శ్రీశైలం ప్రాజెక్టులో సర్వం కోల్పోయి రాష్ట్రానికి వెలుగులు నింపాం. కానీ పాలకులు మాత్రం మాకు చీకట్లే మిగిల్చారు. మాకు కరెంట్ సమస్య ఉందని ఏళ్లుగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కింది.

– లక్ష్మీనారాయణ, వెల్టూరు

లోఓల్టేజీ సమస్య ఉండదు



మా గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి కావడంతో లోఓల్టేజీ సమస్యకు చెక్ పడనుంది. ఇప్పటి వరకు విద్యుత్ లో ఓల్టేజీ కారణంగా నిత్యం బోరు మోటార్లు, ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయి ఇబ్బందులు పడేవాళ్లం. ఎట్టకేళకు మా సమస్యకు పరిష్కారం దొరికింది.

– మద్దిలేటి, వెల్టూరు

'గ్రామాల్లో పార్టీని బలోపేతం చేస్తాం'


కరపత్రాలు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: మండలంలోని గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయడానికి కార్యచరణతో ముందుకెళ్తున్నామని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య అన్నారు. మండలంలోని నాగల్‌కద్మూర్ గ్రామంలో గురువారం బీజేపీ బూత్ స్థాయి సమావేశం నిర్వహించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 వసంతాల వికసిత్ భారత్ యొక్క అమృతకాలంసేవా సుపరిపాలన పేదల సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శులు మల్లారెడ్డి, వినోద్, భీంరెడ్డి, వినోద్, నరేష్, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

'భగీరథ' పైప్‌లైన్ లీకేజీలు



అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోయి తాగునీరు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపుల లీకేజీని గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని రోజుల కిందట గ్రామ పంచాయతీ సోర్స్ బోర్లు సైతం మరమ్మతుకు గురయ్యాయని, దీంతో తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ పైప్‌లు సైతం లీకేజీ అవ్వడంతో తాగునీటి సమస్య జటిలంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు నిత్యం తాగునీటి కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపరించిందన్నారు. తాగునీటి సమస్య గురించి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పైపుల లీకేజీ ద్వారా తాగు నీరు కలుషితమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుతుబ్, వెంకటేష్, శ్రీను, కురుమూర్తి, అంజి పాల్గొన్నారు.

వారాంతపు సంత.. తీరని చింత


అమరచింతలో వారంతపు సంతలో కిక్కిరిసిన జనం

అమరచింత: పట్టణంలో నిర్వహించే వారాంతపు సంతకు ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో రహదారిపైనే సంతను నిర్వహించుకునే దుస్థితి నెలకొంది. తహసీల్దార్ కార్యాలయం రాహదారికి ఇరువైపులా విక్రయదారులు, రైతులు కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. సాయంత్రం వాహనాలతో పాటు అన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులు, ఆటోలు ఇదే రహదారిలో వెళ్తుడటంతో ట్రాఫిక్ జాం అవుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు. సంత నిర్వహించేందుకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయని మున్సిపల్ అధికారులు విక్రయదారుల నుంచి తైబజార్ వసూలు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


జిల్లా కేంద్రంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వనపర్తి టౌన్: 100 రోజుల కార్యచరణలో భాగంగా పుర వార్డుల్లో ప్రతి రోజూ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు తడి, పొడి చెత్త విభజనపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని 17, 19, 22, 13, 26, 29, 31, 08, 27, 2వ వార్డుల్లో తడి, పొడి వ్యర్థాల విభజన, సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియాపై అవగాహన, వీధి, పెంపుడు కుక్కలపై ఏబీసీ ప్రచారం, కుక్కలను పట్టుకోవడం, డ్రెయినేజీల్లో డెస్టిల్ తొలగించే పనులను ఆయన దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో పరిసరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి కాలనీకి వస్తున్న చెత్త ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. వర్షపునీరు ఇంటి ముంగిళ్లలో నిల్వ ఉండకుండా పారబోయాలని, లేని పక్షంలో దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న తమ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. వార్డులోని రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.

ఆత్మకూర్: పరిశుభ్రతను పాటిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దామని, పట్టణ ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు, కార్మికులతో కలిసి 100 రోజుల ప్రణాళికలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాల కారణంగా నివాసాల పరిసరాల్లో వర్షపు నీరు చేరి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, డ్రమ్ములు, హౌసులు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిసరాల శుభ్రత గురించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్, కాషన్న, ముబ్బషీర్, అశోక్, మోహన్‌సాగర్, దయానంద్, శివన్న, మధుబాబు, ఆశన్న, మక్బూల్, అరుణ్‌కుమార్, షోయబ్, నరేందర్, పురపాలిక సిబ్బంది ఉన్నారు.


అమరచింతలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది


ఆత్మకూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శశిధర్

క్లుప్తంగా

'బాలలను పనిలో పెట్టుకోవద్దు'

వనపర్తి రూరల్: బాలుడిని పనిలో పెట్టుకున్న షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శంకర్‌గంజ్ రోడ్డులోని భవానీ జ్యువెలర్స్ షాపు, ఇందిరా పార్క్ సమీపంలోని జేపీ జ్యువెలర్స్ షాపుల్లో బాలకార్మికులను పనిలో పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఆపరేషన్ ముస్కాన్ సంస్థ, లేబర్ ఆఫీసర్ రఫీ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించగా.. వారు మైనర్ బాలురు అని తేలడంతో వారిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. గురువారం లేబర్ ఆఫీసర్ రఫీ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో షాపు యజమానులు మారం చంద్రాయుడు, రాఖీ వెంకటేశ్వర్లు పై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంట పల్లిలో అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రఘు ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్స్ పొందిన షాపుల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసి రశీదు తప్పసనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలని ఆయన రైతులకు సూచించారు. నకిలీ మందులు అమ్మితే సీడ్స్ యాక్టు 1966 చట్టరీత్యా నేరమన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలు పంట కోత తర్వాత దిగుబడి సరిగా రాకపోతే కన్స్యూమర్ ఫోరంలో కేసు నమోదు చేసి తగిన నష్ట పరిహారం పొందవచ్చని సూచించారు. అలాగే నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షిస్తామన్నారు.

శంకర్‌గౌడ్‌కు సన్మానం



వనపర్తిటౌన్: ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శంకర్‌గౌడ్ విద్యార్థులకు అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని శంకర్‌గౌడ్ నివాసంలో ఆయనను పూలమాల, శాలువాతో చిన్నారెడ్డి సన్మానించారు. విద్యా రంగంలో ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచేలా సేవలందించిన శంకర్‌గౌడ్ వినూత్న ఆలోచనలతో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చీర్ల జనార్దన్, ఉపాధ్యాయులు శ్రీవర్ధన్‌రెడ్డి, స్వామి, మైనొద్దీన్, రాములు, బైరోజు చంద్రశేఖర్, వెంకటస్వామి, ఈశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, మధుగౌడ్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ పునర్నిర్మించండి



వీపనగండ్ల: గ్రామంలోని కచ్చీర్ చెట్టు వద్ద ఉన్న వాటర్ ట్యాంక్‌ను పునర్నిర్మించాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో వాటర్ ట్యాంక్ ఉన్న స్థలంలో బస్టాప్‌ను నిర్మించారన్నారు. దీంతో అక్కడ కూడా బస్సులను నిలపాలన్న గ్రామస్తుల నుంచి రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుండడంతో డ్రైవర్లు విసుగు చెంది గ్రామం మీదుగా బస్సులు నడిపేందుకు ఇష్టపడటం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాప్ సమీపంలో వాటర్ ట్యాంక్‌ను పునర్నిర్మించి, ఎంపీడీఓ కార్యాలయం వద్దే అన్ని బస్సులు ఆగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

వనపర్తిటౌన్: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లులకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా భాగస్వామ్యాన్ని విస్తరించడానికి రిజర్వేషన్లు కీలకమని, రిజర్వేషన్లు అమలు చేయకపోవడం అప్రజాస్వామికమే అని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను గందరగోళ పరిచే ప్రయత్నం చేస్తుందని, మతం రంగు పులిమి గొడవలకు కారణమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిక్కిలి బాలయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి శాంతా రాంనాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి

- నూతనభవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తాం
- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి


రహ్మతుల్లాను సన్మానిస్తున్న మంత్రి వాకిటి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

ఆత్మకూర్: స్థానిక మార్కెట్‌యార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని రాష్ట్ర పశు సంవర్థక, డైరీ, క్రీడలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ఆత్మకూర్ మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రహ్మతుల్లాను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి అభినందించి సత్కరించారు. కొత్త పాలక మండలి సభ్యులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, ఆత్మకూర్ మార్కెట్‌యార్డు నూతన భవనం, కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, నాయకులు పరమేష్, నల్గొండ శ్రీను, తులసీరాజ్, భాస్కర్, మశ్చేందర్‌గౌడ్, అజ్మతుల్లా, షాలం, రఫీక్, దామోదర్, సాయిరాఘవ, మహేష్ తదితరులు ఉన్నారు.

అభినందనల వెల్లువ..

నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేట్టిన రహ్మతుల్లాను పలువురు ప్రముఖులు అభినందించారు. మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో రహ్మతుల్లాను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మార్కెట్, రైతుల అభ్యున్నతికి అహర్నిషలు కృషి చేస్తానని చైర్మన్ అన్నారు.

డెంగీ కేసులతో అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

గోపాల్‌పేట: జిల్లాలో ఎక్కడ డెంగ్యూ కేసు నమోదయినా.. వ్యాప్తి చెందకుండా ఉండేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం ఆయన గోపాల్‌పేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మొదట మన గ్రోమోర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించిన అనంతరం ఆయన గర్భిణుల ఈడీడీ రిజిస్టర్ పరిశీలించారు. జులై 26న పొలికెపాడులో పాపకు డెంగ్యూ సోకిన విషయం గురించి ఆరా తీశారు. నివారణకు ఏమేం చర్యలు తీసుకుంటున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఎక్కడైనా డెంగ్యూ కేసు నమోదయితే వెంటనే అక్కడ ప్రత్యేక మెడికల్ క్యాంపు వేసి అందరికీ రక్త పరీక్షలు చేయాలని సూచించారు.

అందుబాటులో ఎరువులు

జిల్లాలో వానాకాలం సాగుకు కావాల్సినంత ఎరువులు ఉన్నాయని, ఎవరూ ఇబ్బందులు పడొద్దన్నారు. భూభారతి చట్టం 2025కి సంబంధించి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సత్వర పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, జిల్లా ఆరోగ్య అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ పాండు నాయక్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఉద్దంసింగ్ చమార్ పోరాటాలు మరువలేనివి

వనపర్తిటౌన్: భారత స్వాతంత్ర్యం కోసం ఉరి తీయబడ్డ విప్లవ జ్వాల ఉద్దంసింగ్ చమార్ పోరాటాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఉద్ధసింగ్ ఛమర్ 85వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఉత్తరయ్య, కవి బూరోజు గిరిరాజాచారి, డాక్టర్ కంటి నిరంజనయ్య, బండలయ్య, బాలేమియా, చింతకుంట కుర్మయ్య, శ్రీనివాసులు శెట్టి, వెంకటేష్, జగపతిరావు, మన్యం ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి


దావాత్‌ఖాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల మేరకు వేగంగా నిర్మించుకుంటే బిల్లులు త్వరగా అందుతాయని ఎంపీడీఓ గోవింద్ రావు లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, మాధరావుపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాధరావుపల్లిలో 57 ఇళ్లు మంజూరు కాగా.. వాటిలో 36 ఇళ్లకు మార్కింగ్ చేయగా ఇప్పటి వరకు 13 ఇళ్ల నిర్మాణం స్లాబ్ వరకు, దావాత్‌ఖాన్‌పల్లిలో 6 ఇళ్లు మంజూరు కాగా ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. ప్రొసీడింగ్ అందుకున్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే వారికి నోటీసులు అందజేసి, వారు ఇచ్చే సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం నాణ్యతగా అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీరాములు, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సందీప్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిర్మాణాలు వేగంగా చేపడితే విడతల వారీగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామస్తులు మున్నూరు జయకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉంటూ నివారణ చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతి కాన్పు పీహెచ్‌సీలోనే జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయుష్మాన్ మందిర్ వైద్యులు మైథిలి, నిహారిక, నాగరాజు, లారెన్స్, సూపర్‌వైజర్లు శాంతమ్మ, సుమశ్రీ, సిబ్బంది రాంచందర్, సతీష్, మదన్‌గోపాల్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వనపర్తి రూరల్: బైక్ అదుపుతప్పి కింద పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పెబ్బేరు పట్టణంలోని చెలిమిల్ల వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన గోపాల్ సొంత పని నిమిత్తం బైక్‌పై పెబ్బేరు మండల కేంద్రానికి వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తుండగా చెలిమిల్ల వద్ద బైక్ అదపు తప్పి కింద పడింది. దీంతో గోపాల్ తీవ్ర రక్తగాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.